తరిగొండలో టీటీడీ హామీలు నెరవేరేనా?

- కలగా మిగిలిన సుదర్శన కౌంటర్
- నిలచిపోయిన పుష్కరిణి అభివృద్ధి పనులు
- మార్చి 5 నుంచి బ్రహ్మోత్సవాలు
- బ్రహ్మోత్సవాలకైనా అధికారులు స్పందిస్తారా?


తరిగొండ లక్ష్మీనరసింహస్వామి ఆలయం


నిలిచిపోయిన స్వామివారి పుష్కరిణి అభివృద్ధి పనులు

గుర్రంకొండ: శ్రీ వేంకటేశ్వర స్వామి భక్తురాలు, ప్రముఖరచయిత్రి శ్రీ వెంగమాంబ పుట్టినిల్లు తరిగొండ గ్రామాన్ని టీటీటీ 17 ఏళ్ల క్రితం దత్తత తీసుకుంది. అప్పట్లో ఇచ్చిన హామీలు ఇప్పటికీ హామీలుగానే మిగిలిపోయాయి. సుదర్శన్ కౌంటర్ ఏర్పాటు కలగా మిగిలిపోయింది. స్వామివారి పుష్కరిణి ఇంతవరకు అభివృద్ధికి నోచుకోలేదు. దీంతో బ్రహ్మోత్సవాల్లో నిర్వహించే స్వామివారి చక్రస్నానం కార్యక్రమం తూతూ మంత్రంగా కానిచ్చేస్తున్నారు. రూ.5 కోట్లతో అభివృద్ధి పనులు చేపట్టి గ్రామ రూపురేఖలు మార్చేస్తామంటూ గతంలో ఇచ్చిన హామీలు నేటికి నెరవేర్చలేదు. మార్చి 5వ తేదీ నుంచి 11 రోజుల పాటు స్వామివారి బ్రహ్మోత్సవాలు జరగనున్నాయి. బ్రహ్మోత్సవాలు ప్రారంభమయ్యేలోగా అధికారులు స్పందించి అభివృద్ధి పనులు ప్రారంభించాలని స్థానికులు కోరుతున్నారు.

2008లో టీటీడీ స్వాధీనం

దేవాదాయశాఖ ఆధీనంలో ఉన్న ఈ ఆలయాన్ని 2008లో టీటీడీ స్వాధీనం చేసుకొంది. ఆలయంతో పాటు గ్రామాన్ని దత్తత తీసుకొని గ్రామాన్ని రూ. 5 కోట్లతో అభివృద్ధి చేస్తామని అధికారులు, పాలకులు అప్పట్లో హామీలు గుప్పించారు. తిరుమలలో శ్రీ వేంకటేశ్వరస్వామి దర్శనం కోసం ఇక్కడి ఆలయంలో సుదర్శనం కౌంటర్‌ను ఏర్పాటు చేస్తామన్నారు. ఇందుకోసం ఆలయంలో ఓ గదిని ముస్తాబు చేశారు. కొంత ఫర్నిచర్ ఏర్పాటు చేసి నిర్మాణ పనులను అసంపూర్తిగా వదిలేశారు. కల్యాణమండపం దగ్గరున్న స్వామివారి పుష్కరిణి(కోనేరు)కు పూర్వ వైభవం తీసుకొస్తామన్నారు. కోనేరుకు అభివృద్ధి పనులు చేసి బృందావనంగా మారుస్తామని హామీలు ఇచ్చినా ఇంతవరకు పట్టించుకునే నాథుడే కరువయ్యారు. కంపచెట్లతో నిండిపోయిన కోనేరును కేవలం కంపచెట్లు తొలగించే పనులు వరకు చేసి నిలిపివేశారు. గతంలో స్వామివారి బ్రహ్మోత్సవాల్లో భాగంగా చక్రస్నానం కార్యక్రమం కోసం ఈ కోనేరు నుంచే పరిశుద్ధ జలాన్ని తీసుకెళ్లేవారని చరిత్ర చెబుతోంది. నేడు కోనేరు శిథిలమైపోవడంతో చక్రసాన్నం కార్యక్రమం స్వామివారి కోనేటి నీటితో కాకుండా తూతూ మంత్రంగా కార్యక్రమం కానిచ్చేస్తున్నారు. స్వామివారి ఆలయం ముందుభాగంలో తొలగించబడిన ధ్వజస్తంభాన్ని ఇంతవరకు పునః ప్రతిష్టంచలేదు. పంచాయతీ పరిధిలోని నాలుగు గ్రామాల్లో ఆలయానికి మాన్యం భూములు ఉన్నా అవి అన్యాక్రాంతమయ్యాయి. టీటీడీ అధికారులు బ్రహ్మోత్సవాలప్పుడు ఇక్కడ బసచేయడానికి క్వార్టర్లు, అతిథిగృహాలు ఏర్పాటుచేస్తామని ఇచ్చిన హామీలు నెరవేర్చడంలో విఫలమయ్యారు.

హామీలు.. నీటి మూటలు

- ఆలయానికి సమీపంలోని పుష్కరినికి మరమ్మతులు చేయించి మళ్లీ వినియోగంలోకి తేవాల్సి ఉంది.
- ఆలయంలో ప్రస్తుత యాగశాల, పోటుభవనాలను తొలగించి కొత్తవి నిర్మించాల్సి ఉంది.
- ప్రతి ఏటా ఆలయంలో నిర్వహించే వైకుంఠ ఏకాదశి ఉత్సవాల్లో భాగంగా ఆలయంలో శాశ్వత ప్రాతిపదికన ఉత్తర ద్వారాన్ని ఏర్పాటు చేస్తామన్నారు.
- ఉరుస్తున్న ఆలయానికి వెంటనే మరమ్మతులు చేయిస్తామన్నారు.
- ఆలయం ప్రాంగణంలో ఉన్న కల్యాణకట్ట, మరుగుదొడ్లను తొలగించి పుష్కరిణికి సమీపంలో కొత్తగా నిర్మిస్తామన్నారు.
- ప్రతినెలా స్వామి నక్షత్రంరోజున ఆలయంలో నిర్వహించే స్వామివారి కల్యాణోత్సవానికి తిరుమల లడ్డూప్రసాదాలు 500 పంపిస్తామన్నారు.
- గర్భగుడికి వెండి వాకిలి చేయించడం, ఆర్జిత సేవలు ప్రవేశపెట్టడం, స్వాతి నక్షత్రం రోజు స్వామి వారికి గ్రామోత్సవం నిర్వహించడం, పౌర్ణమి రోజును సుదర్శన హోమం నిర్వహించడం వంటి హామీ ఇచ్చారు. అయితే ఈహామీలు నీటిమూటలుగానే మిగిలిపోయాయి.

ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తాం

తరిగొండలో ఇచ్చిన హామీలను టీటీడీ ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తాం. ఆలయంలో పోటు, మరుగుదొడ్ల తొలగించడం వంటి పనులకు సంబంధించి గతంలోనే ప్రాతిపాదనలు పంపించారు. సిబ్బంది వసతి గృహాల నిర్మాణం, ఇతర సమస్యలను ఉన్నతాధికారులకు వివరిస్తాం

– కృష్ణమూర్తి, టీటీడీ ఇన్‌స్పెక్టర్, తరిగొండ

క్లుప్తంగా

నేడు మండల మీట్

నిమ్మనపల్లె : మండల సాధారణ సర్వసభ్య సమావేశం శనివారం ఎంపీపీ డి.నరసింహులు అధ్యక్షతన నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ పరమేశ్వర్ రెడ్డి తెలిపారు. స్థానిక మండల పరిషత్ సమావేశ భవనంలో ఉదయం 11 గంటలకు నిర్వహిస్తామని తెలిపారు. మండల స్థాయి అధికారులు, సర్పంచులు, ఎంపీటీసీలు, కో–ఆప్షన్ సభ్యులు, ఇతర ప్రజా ప్రతినిధులు అందరూ తప్పనిసరిగా హాజరుకావాలని కోరారు.

మధ్యాహ్న భోజనం తనిఖీ


విద్యార్థులతో కలిసి మధ్యాహ్న భోజనం తింటున్న అధికారులు

ములకలచెరువు: స్థానిక మండల కేంద్రంలోని మోడల్‌స్కూల్‌లో తహసీల్దార్ ప్రదీప్, ఎంఈఓ వెంకటరమణ శుక్రవారం మధ్యాహ్న భోజనాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా విద్యార్థుల హాజరు పట్టికను పరిశీలించారు. వసతి గృహాన్ని సందర్శించి అక్కడి వసతులపై విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం మధ్యాహ్న భోజనాన్ని విద్యార్థులతో కలిసి తిన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

తంబళ్లపల్లె: స్థానిక మోడల్ స్కూల్‌లో 2025–26 విద్యా సంవత్సరానికి 6వ తరగతిలో ప్రవేశం కొరకు దరఖాస్తు చేసుకునేందుకు శుక్రవారం నోటిఫికేషన్ విడుదలైనట్లు ప్రిన్సిపాల్ హేమంత్‌కుమార్ తెలిపారు. ప్రభుత్వ గుర్తింపు పొందిన పాఠశాలలో 5వ తరగతి చదివి ప్రమోషన్ అర్హత పొందినవారు ఓసీ,బీసీ విద్యార్థులు అర్హులన్నారు. ఈ నెల 24 నుంచి మార్చి నెల 31వతేదీలోపు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. పరీక్ష రుసుం ఓసీ,బీసీలు రూ.150, ఎస్సీ, ఎస్టీలు రూ.75 చెల్లించాలన్నారు. దరఖాస్తు చేసుకున్న విద్యార్థులకు ఏప్రిల్ 20వ తేదీ మోడల్‌స్కూల్‌లో ఉదయం 10 గంటల నుంచి 12 గంటల వరకు తెలుగు, ఇంగ్లీషు మాధ్యమ్యాల్లో ప్రవేశపరీక్ష నిర్వహిస్తామని తెలిపారు. పరీక్షలో ప్రతిభ ఆధారంగా రిజర్వేషన్ నిబంధనల మేరకు ప్రవేశం కల్పించడం జరుగుతుందన్నారు. మరిన్ని వివరాలను 9052153538 నంబర్‌ను సంప్రదించాలని కోరారు.

ద్విచక్ర వాహనం అపహరణ

పెద్దతిప్పసముద్రం: మండలంలోని కమ్మచెరువు పంచాయతీ మారుగానిపల్లికి చెందిన వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకుడు వెంకటసుబ్బారెడ్డి ఇంటి ఎదుట నిలిపిన రాయల్ ఎన్‌ఫీల్డ్ బైక్‌ను గుర్తు తెలియని వ్యక్తులు గురువారం అర్ధరాత్రి అపహరించారు. రెండున్నర లక్షల రూపాయల విలువ చేసే వాహనం చోరీకి గురైందని వెంకట సుబ్బారెడ్డి తనయుడు విజయ్ శుక్రవారం పోలీసులకు ఫిర్యాదు చేశారు.

ఉత్సవ విగ్రహాల బహూకరణ


లక్ష్మీనరసింహ ఉత్సవ విగ్రహాలు

కురబలకోట: మండలంలోని మంద్యంవారిపల్లెలో కొత్తగా నిర్మించిన లక్ష్మీ నరసింహ స్వామి ఆలయానికి చింతమాకులపల్లెకు చెందిన కనుగొండ వెంకటరమణారెడ్డి, కనుగొండ పద్మావతమ్మ దంపతులు ఉత్సవ విగ్రహాలు బహూకరించారు. తంబళ్లపల్లె ఎమ్మెల్యే పెద్దిరెడ్డి ద్వారకనాథరెడ్డి చేతుల మీదుగా సమర్పించారు. వేద మంత్రాల నడుమ పండితులు శుక్రవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉత్సవ విగ్రహాలను అందజేసిన కనుగొండ వెంకటరమణారెడ్డి దంపతులను గ్రామస్తులు అభినందించారు.

పార్టీ బలోపేతానిక కృషి

రామసముద్రం: పార్టీ బలోపేతానిక కృషి చేస్తామని వైఎస్సార్‌సీపీ బీసీ సెల్ స్టేట్ జాయింట్ సెక్రెటరీ గెవన్న తెలిపారు. రామసముద్రం మండలం చొక్కాండ్లపల్లి పంచాయతీ కనగాని గ్రామానికి చెందిన గెవన్నకు మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు రాష్ట్ర వైఎస్సార్ సీపీలో కీలక బాధ్యతలు అప్పగించారు. ఆయనను వైఎస్సార్ సీపీ బీసీ సెల్ స్టేట్ జాయింట్ సెక్రెటరీగా నియమించింది. ఈ సందర్భంగా గెవన్న మాట్లాడుతూ తనపై నమ్మకంతో ఈ పదవి ఇచ్చినందుకు మాజీ సీఎం జగన్మోహన్ రెడ్డి, మాజీ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, ఎంపీ మిథున్ రెడ్డి, మదనపల్లె ఇన్‌చార్జి నిసార్ అహ్మద్‌కు కృతజ్ఞతలు తెలిపారు.

శాంతి భద్రతల పరిరక్షణకు సహకరించండి

బి.కొత్తకోట: పట్టణంలో శాంతిభద్రల పరిరక్షణ, చోరీల నివారణ కోసం వ్యాపార సంఘాలు, ప్రజలు సహకరించాలని సీఐ జీవన్ గంగనాథ్‌బాబు కోరారు. గురువారం రాత్రి స్థానిక ఓ కల్యాణ మండపంలో వ్యాపార సంఘాలు, స్థానిక ప్రముఖులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ దుకాణాల వద్ద సీసీ కెమెరాలను ఏర్పాటు చేసుకోవాలని కోరారు. అనుమానితుల సమాచారం ఇవ్వాలని కోరారు. అలాంటి వారిపై అప్రమత్తంగా ఉండాలని సూచించారు. మైనర్లకు బైక్‌లు ఇవ్వరాదని, వారిపై జాగ్రత్తలు తీసుకోవాలని కోరారు. హెల్మెట్ లేకుండా బైక్ ప్రయాణం చేయకూడదని సూచించారు.

నేడు ఉచిత వైద్య శిబిరం

పెద్దతిప్పసముద్రం: మండలంలోని తుమ్మరకుంటకు చెందిన యంగ్ ఇండియా సేవా ఫౌండేషన్ వారి ఆధ్వర్యంలో శనివారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించనున్నారు. బెంగళూరులోని వైదేహీ సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రి వైద్యులు గుండె, క్యాన్సర్, ఎముకలకు సంబంధిత వ్యాధులను చికిత్స అందిస్తారని నిర్వాహకులు తెలిపారు.

మనిషి ఉన్నతికి చదువే ప్రధానం

కురబలకోట: మనిషి ఉన్నతికి చదువే ప్రధానమని మిట్స్ ఇంజినీరింగ్ కళాశాల కరస్పాండెంట్ డాక్టర్ ఎన్. విజయభాస్కర్ చౌదరి అన్నారు. రెండు రోజుల పాటు ప్రతిష్టాత్మకంగా జరిగే అశ్వ–25 జాతీయ ఫెస్ట్‌ను శుక్రవారం రాత్రి సినీ కళాకారుల మధ్య అట్టహాసంగా ప్రారంభించారు. ప్రత్యేక అతిథులుగా సినీ గాయకులు సమీర భరద్వాజ్, దీపు, హారిక నారాయణ్ హాజరయ్యారు. జ్యోతి ప్రజ్వలన అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రతి విద్యార్థికి భవిష్యత్తు ఉందన్నారు. ఏ ఉద్యోగానికైనా భావవ్యక్తీకరణ ముఖ్యమన్నారు. క్రమ శిక్షణతో ముందుకు సాగేవారు అవకాశాలను అందిపుచ్చుకోవడంలో ముందు వరుసలో ఉంటారన్నారు. ఆర్ఆర్ఆర్ అకాడమీ ప్రెసిడెంట్ ద్వారకనాథ్, ప్రిన్సిపాల్ యువరాజ్, కన్వీనర్ కమాల్‌బాషా పాల్గొన్నారు.

ఫైర్ ఎక్విప్‌మెంట్లు అందజేత

మదనపల్లె : మదనపల్లె, ములకలచెరువు, వాల్మీకిపురం అగ్నిమాపక కేంద్రాలకు సబ్ కలెక్టర్ మేఘ స్వరూప్ రూ.లక్ష విలువచేసే ఫైర్ ఎక్విప్‌మెంట్లను అందజేశారు. శుక్రవారం స్థానిక ఫైర్‌స్టేషన్‌లో జిల్లా అగ్నిమాపక అధికారి అనిల్‌కుమార్‌తో కలిసి సిబ్బందికి ఫైర్ ఎక్విప్‌మెంట్లను అందజేశారు. వాటిలో పవర్ సా ఒకటి, లైఫ్ బాయిలు 3, డ్రాగన్ లైట్స్ 4, హెల్మెట్స్, లైఫ్ జాకెట్స్, రెయిన్‌కోట్స్, గాగుల్స్ తదితర పరికరాలు ఉన్నాయి. ఆఫీసర్ జీ.శివప్ప, సిబ్బంది పాల్గొన్నారు.

ఆలయాలు సామాజిక ఆధ్యాత్మిక కేంద్రాలు

ఎమ్మెల్యే పెద్దిరెడ్డి ద్వారకనాథరెడ్డి


ఆలయ ప్రతిష్ట కార్యక్రమంలో ఎమ్మెల్యే పెద్దిరెడ్డి ద్వారకనాథరెడ్డి

కురబలకోట: ఆలయాలు సామాజిక ఆధ్యాత్మిక కేంద్రాలని తంబళ్లపల్లె ఎమ్మెల్యే పెద్దిరెడ్డి ద్వారకనాథ రెడ్డి అన్నారు. శుక్రవారం మండలంలోని మంద్యం వారిపల్లెలో కొత్తగా నిర్మించిన లక్ష్మీనరసింహ స్వామి ఆలయ ప్రతిష్టాపన కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొని పూజలు అభిషేకం నిర్వహించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రజలు ఆధ్యాత్మిక భావనను పెంపొందించుకుని, మానసిక ప్రశాంతతను పొందాలని పేర్కొన్నారు. ఆలయాలు ప్రశాంత నిలయాలని, భగవంతుడు లేకుండా మనిషి లేడన్నారు. కాలం ఎంతగా మారినా ప్రతి ఒక్కరికీ ఆధ్యాత్మిక చింతన అవసరమని పేర్కొన్నారు. ఆచార, సంప్రదాయ, సంస్కృతుల సంరక్షణలో కూడా ఆలయాలు ప్రతీకగా నిలుస్తున్నాయన్నారు. ఆలయాలు ఆధ్మాత్మిక కేంద్రాలుగా వృద్ధి చెందాలని తెలిపారు. నాయకులు బైసాని చంద్రశేఖర్‌రెడ్డి, మనోహర్ రెడ్డి, డీఆర్. ఉమాపతి రెడ్డి, ఆర్కే కృష్ణారెడ్డి, కోళ్ల వాసుదేవరెడ్డి, ఎంపీటీసీ ఆనందరెడ్డి, ప్రవీణ్‌రెడ్డి, కొరివి జగన్నాథ రెడ్డి, ఆర్సీ ఈశ్వర్‌రెడ్డి, వెంకట్రమణారెడ్డి, నరసింహులు, మధు, లోకేష్, అమరనాథరెడ్డి, బండపల్లె కృష్ణారెడ్డి, అన్వేష్, నారాయణ పాల్గొన్నారు.

పంటను పరిశీలించిన అధికారులు

పెద్దతిప్పసముద్రం: నకిలీ విత్తనాలు నట్టేట ముంచాయి, పంట దిగుబడి లేక పీకల్లోతు అప్పుల్లో అన్నదాతలు అనే శీర్షికతో సాక్షి పత్రికలో ఈ నెల 20న ప్రచురితమైన కథనంపై జిల్లా ఉన్నతాధికారులు స్పందించారు. ఈ నేపథ్యంలో శుక్రవారం మూడు మండలాలకు సంబంధించిన ఉద్యానవన శాఖ అధికారి భీమేష్ మండల కేంద్రంలో రైతు ఫర్వేజ్ సాగు చేసి నష్టపోయిన పుచ్చ కాయను పంటను పరిశీలించారు. రైతు కొనుగోలు చేసిన విత్తన కంపెనీ విత్తన రకం, వాడిన క్రిమి సంహారక మందులు, ఎరువుల గురించి రైతును అడిగి తెలుసుకున్నారు. సమగ్రమైన నివేదికను ఉన్నతాధికారులకు అందజేస్తామని హెచ్ఓ తెలిపారు.

సారా రహిత జిల్లాగా తీర్చిదిద్దుదాం

పీలేరు : సారా రహిత జిల్లాగా తీర్చిదిద్దుదామని రాయచోటి ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ ఆఫీసర్ జి. మధుసూదన్ అన్నారు. శుక్రవారం పీలేరు ఎక్సైజ్ కార్యాలయాన్ని తనిఖీ చేశారు. కార్యాలయం రికార్డులు పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన నవోదయం 2.0 కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఆదేశించారు. ప్రజల ఆర్థిక, సామాజిక ప్రయోజనాలను కాపాడేదమే లక్ష్యంగా సారాను నిర్మూలించాలని పిలుపునిచ్చారు. అసిస్టెంట్ ఎక్సైజ్ సూపరింటెండెంట్ వై. యోగేంద్ర పాల్గొన్నారు.

డాక్టరేట్ ప్రదానం

పీలేరురూరల్ : స్థానిక సంజయ్‌గాంధీ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో కంప్యూటర్ సైన్స్ విభాగంలో అధ్యాపకుడిగా పనిచేస్తున్న జె. కిషోర్‌కుమార్‌రెడ్డికి ఎస్వీయూ నుంచి డాక్టరేట్ లభించింది. శ్రీ వెంకటేశ్వర పైతాలయం కంప్యూటర్ సైన్స్ విభాగంలో ఆచార్య ఎస్. రామకృష్ణ పర్యవేక్షణలో ఇంటిగ్రేషన్ ఆఫ్ అడ్వాన్స్ ఇమేజ్ ఎన్ హన్సిడ్ రిట్రీవల్ వెబ్‌సెర్చ్ ఇంజన్స్ అండ్ అప్లికేషన్స్ టు అనాలసిస్ ఆఫ్ 2డి, 3డి ప్రిన్ ఎమ్మారై ఇమేజస్ అనే అంశంపై కిషోర్‌కుమార్‌రెడ్డి పరిశోధన చేశారు.

వడదెబ్బపై విద్యార్థులకు అవగాహన

రామసముద్రం: రామసముద్రం మండలంలోని గుంత ఎంబాడి ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో వడదెబ్బపై మెడికల్ ఆఫీసర్ డాక్టర్ లీల విద్యార్థులకు శుక్రవారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అధిక ఉష్ణోగ్రతల కారణంగా ఎండలు మండుతుండటంతో విద్యార్థులు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. రోజుకు 15 గ్లాసుల నీళ్ల తాగాలన్నారు. విద్యార్థులు ఎండలో ఎక్కువ తిరగకుండా జాగ్రత్తగా ఉండాలని సూచించారు.

మళ్లీ అధికారంలోకి వస్తాం.. అధైర్య పడకండి

నియోజకవర్గ సమన్వయకర్త నిసార్ అహ్మద్


కార్యకర్తలతో మాట్లాడుతున్న సమన్వయకర్త నిసార్ అహ్మద్

నిమ్మనపల్లె: వైఎస్సార్‌సీపీ కార్యకర్తలు, ప్రజలు అధైర్య పడాల్సిన అవసరం లేదని మళ్లీ జగనన్న అధికారంలోకి వచ్చి సంక్షేమ పాలన కొనసాగిస్తారని మదనపల్లె వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త నిసార్ అహ్మద్ అన్నారు. శుక్రవారం మండలంలోని రాచవేటివారిపల్లెలో ముస్లింల ఆహ్వానంతో గ్రామానికి వచ్చారు. స్థానిక మసీదులో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. నిత్యావసర వస్తువుల ధరలు, రైతాంగానికి సంబంధించి ఎరువులు, గిట్టుబాటు ధర లేకపోవడం తదితర అంశాలపై స్థానికులు ఆయనతో అసంతృప్తి వ్యక్తం చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ సూపర్ సిక్స్ హామీలతో ప్రజలను మభ్యపెట్టి, అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం హామీలు అమలు చేయకుండా ప్రజలను మోసం చేసిందన్నారు. ఆర్భాటంగా ప్రారంభించిన ఉచిత గ్యాస్ సిలిండర్ పథకంలో చాలామందికి గ్యాస్ నగదు బ్యాంకు అకౌంట్లో జమ కాలేదని తెలిపారు. ఉచిత బస్సు ఊసే లేదని, అమ్మఒడి ఇవ్వలేదన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు నూర్ మొహిద్దీన్ ఖాన్, కరీముల్లా, నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

భక్తులకు మెరుగైన రవాణా సౌకర్యాలు కల్పించాలి

మదనపల్లె సిటీ: శివరాత్రి పర్వదినం పరస్కరించుకుని భక్తులకు మెరుగైన రవాణా సౌకర్యాలు కల్పించాలని ఆర్టీసీ–1 డిపో మేనేజర్ మూరే వెంకటరమణారెడ్డి తెలిపారు. శుక్రవారం స్థానిక డిపో కార్యాలయంలో శివరాత్రి పురస్కరించుకుని సిబ్బందితో సమీక్షా సమావేశం నిర్వహించారు. డిపో పరిధి నుంచి తంబళ్లపల్లె మల్లయ్యకొండకు 71 బస్సులు నడపనున్నట్లు తెలిపారు. అంగళ్లలోని మల్లయ్యకొండకు 10 బస్సులు నడపనున్నట్లు పేర్కొన్నారు. సిబ్బంది, గ్యారేజ్, ట్రాఫిక్ సిబ్బందది సమన్వయంతో పని చేయాలన్నారు. సీఐ రేవతి, ఎంఎఫ్ రవి, సిబ్బంది పాల్గొన్నారు.

మహాశివరాత్రికి ప్రత్యేక బస్సులు

మహాశివరాత్రి పురస్కరించుకుని ప్రత్యేక బస్సులు నడపనున్నట్లు ఆర్టీసీ–2 డిపో మేనేజర్ అమర్‌నాథ్ తెలిపారు. మదనపల్లె నుంచి నిమ్మనపల్లె మీదుగా తవళం నేలమల్లేశ్వరస్వామి ఆలయానికి 13 బస్సులు, కలకడ నుంచి ఝరికి 18 బస్సులు నడపనున్నట్లు తెలిపారు. ఈ బస్సులు ఈనెల 26,27 తేదీల్లో రెండు రోజులు నడుపుతామన్నారు. భక్తులు ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణించాలని కోరారు.

పీలేరురూరల్ : మహాశివరాత్రి ఉత్సవాలకు పీలేరు డిపో నుంచి ప్రత్యేక ఆర్టీసీ సర్వీసులు నడుపుతున్నట్లు డీఎం పి. నిర్మల తెలిపారు. శుక్రవారం స్థానిక విలేకరులతో మాట్లాడుతూ ఈ నెల 26, 27 రెండు రోజుల పాటు పీలేరు – తలకోనకు 25 బస్సులు, బసన్నగారిపల్లె – తలకోనకు 3 బస్సులు, భాకరాపేట – తలకోనకు 4 బస్సులు, బోడేవాండ్లపల్లె – తలకోనకు 3 నడుపుతామని తెలిపారు. అలాగే ఈ నెల 27న కలకడ ఝరి ఉత్సవానికి 10 ప్రత్యేక బస్సు సర్వీసులు నడుపతామని, ప్రయాణీకులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో సీఐ సుబ్బమ్మ, ఎంఎఫ్ హరినాథరెడ్డి, బస్‌స్టేషన్ మేనేజర్ బాబునాయక్ పాల్గొన్నారు.

ఆర్టీసీలో ఖాళీపోస్టులు భర్తీ చేయాలి


మాట్లాడుతున్న దామోదరరావు

పీలేరురూరల్ : రాష్ట్ర వ్యాప్తంగా ఆర్టీసీలో ఖాళీపోస్టులు భర్తీ చేయాలని ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు పలిశెట్టి దామోదరరావు అన్నారు. శుక్రవారం స్థానిక ఆర్ అండ్ బీ గెస్ట్ హౌస్‌లో పీలేరు డిపో ఎంప్లాయిస్ యూనియన్ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ ఆర్టీసీలో కొత్తగా విద్యుత్ బస్సులు ప్రవేశపెట్టే నిర్ణయాన్ని స్వాగతిస్తున్నామని తెలిపారు. విద్యుత్ బస్సులు ప్రైవేటు వ్యక్తుల ద్వారా కాకుండా ప్రభుత్వమే నడపాలన్నారు. రాష్ట్రంలో నిరుద్యోగ యువతకు ఉద్యోగ అవకాశాలు కల్పించి, ఆర్టీసీని లాభాల బాట పట్టించాలని పేర్కొన్నారు. రాష్ట్ర విభజన నాటికి ఆర్టీసీలో 62 వేల మంది సిబ్బంది ఉంటే, నేడు సుమారు 47 మంది మాత్రమే ఉద్యోగులు ఉన్నారని తెలిపారు. సుమారు 8 వేల మంది ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులు పని చేస్తున్నారని చెప్పారు.యూనియన్ జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ కె.వి. రమణ, జోనల్ నాయకులు జి.ఎస్. మణ్యం, జిల్లా అధ్యక్షుడు ఆనంద బాబు, కార్యదర్శి బి.సి. శేఖర్, డిపో అధ్యక్షుడు ఎ.ఆర్. చంద్ర, ఖాదర్‌బాషాపాల్గొన్నారు.

క్షయవ్యాధిని నిర్మూలిద్దాం

గుర్రంకొండ: క్షయవ్యాధిని నిర్మూలిద్దామని జిల్లా ఆరోగ్య విద్యాధికారి మహమ్మద్‌రఫీ, వాల్మీకీపురం టీబీ యూనిట్ పర్యవేక్షకులు నాగిరెడ్డి పిలుపునిచ్చారు. మండలంలోని తరిగొండ జెడ్పీ హైస్కూల్లో శుక్రవారం టీబీ వ్యాధిపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామంలో ర్యాలీ నిర్వహించి స్థానికులతో ప్రతిజ్ఞ చేయించారు. అనంతరం వారు మాట్లాడుతూ భవిష్యత్‌లో టీబీ రాకుండా ముందస్తు నివారణ చర్యల్లో భాగంగా ప్రభుత్వం బీసీజీ టీకాలను ప్రవేశపెట్టిందన్నారు. టీబీకి వ్యతిరేకంగా మనిషిలో రోగనిరోధక శక్తిని మరింత పెంచడానికి ఈ అవగాహన సదస్సులో ఎంతగానో ఉపయోగపడతాయన్నారు. బీసీజీ టీకాలు ఎటువంటి అనుమానాలకు తావులేకుండా వేసుకోవచ్చన్నారు. గళ్ల పరీక్షలు నిర్వహించి వ్యాధి నిర్ధారణ అయితే ఆరునెలల పాటు మందులు డాట్స్ ద్వారా అందిస్తామన్నారు. టీబీ రోగులకు పోషకాహారం కోసం ప్రతినెలా రూ. 1,000 అందిస్తామన్నారు. క్షయవ్యాధిలేని సమాజం కోసం అందరం కృషి చేయాలని సూచించారు. వైద్యాధికారిణి రాజసులోచన, హెడ్మాస్టర్ మనోరంజని, హెల్త్‌సూపర్‌వైజర్ వెంకటరమణ పాల్గొన్నారు.

నీటి సంరక్షణ అందరి బాధ్యత


మొక్కలు నాటి నీళ్లు పోస్తున్న పీఓ ఖాజామొయినుద్దీన్

మదనపల్లె : నీటిని సంరక్షించడం ప్రతి ఒక్కరి బాధ్యత అని వాటర్‌షెడ్ ప్రాజెక్ట్ ఆఫీసర్ ఖాజా ఖాజామొయినుద్దీన్, దుబ్బిగానిపల్లె సర్పంచ్ బుడ్డయ్య అన్నారు. రాష్ట్రవ్యాప్తంగా నిర్వహించనున్న వాటర్‌షెడ్ అవగాహన యాత్ర ప్రారంభకార్యక్రమం శుక్రవారం మండల పరిధిలోని కొత్తవారిపల్లె–2 పంచాయతీ దుబ్బిగానిపల్లెలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఖాజామొయినుద్దీన్ మాట్లాడుతూ వాటర్‌షెడ్ పథకంలో భాగంగా ఎన్ఆర్ఎం స్కీం కింద 27 పనులకు రూ.38.57లక్షలు, పీఎస్ఐ స్కీం కింద 59మంది రైతులకు రూ.12.50లక్షలు, ఈపీఏ పథకం కింద 9 పనులకు రూ.3.12లక్షలు మంజూరయ్యాయని తెలిపారు. అదేవిధంగా ఎన్ఆర్ఎం పథకంలో చిన్న ఊటకుంటలు..21, రాతికట్టడాలు..4, డగౌట్‌పాండ్..1, ఫారంఫాండ్..1, పీఎస్ఐ పథకం కింద ట్రాక్టర్ మడకలు, ఆయిల్ ఇంజన్, టార్పాలిన్లు, స్ప్రేయర్‌మిషన్లు, పీవీసీ పైపులు పొందవచ్చన్నారు. జేఈ ప్రత్యూష, టీఓలు మల్లికార్జున, ధర్మేంద్ర, కాత్యాయని,రాజగోపాల్ పాల్గొన్నారు.

మాతృభాష మాధుర్యం మరువలేనిది


మాట్లాడుతున్న వేంపల్లె అబ్దుల్‌ఖాదర్

పీలేరు రూరల్ : మాతృభాష మాధుర్యం మరువలేనిదని కవి వేంపల్లె అబ్దుల్‌ఖాదర్ అన్నారు. శుక్రవారం స్థానిక గిరిజన సంక్షేమ బాలికల గురుకుల పాఠశాలలో అంతర్జాతీయ మాతృభాషా దినోత్సవ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మాతృభాష మధురమైనదని పేర్కొన్నారు. మాతృభాష మానవ మనుగడకు మూలాధారమని, మాతృభాషాభివృద్ధికి కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో తెలుగు భాషా సమితి అధ్యక్షుడు జలకనూరి మురళీధర్‌రాజు, విశ్రాంత ప్రధానోపాధ్యాయులు శ్రీరాములురాజు, ఉపాధ్యాయులు సుహాసిని, ప్రమీల, లక్ష్మీదేవి, లలితకళ, చందన, హరిత పాల్గొన్నారు.

మాతృభాష ఉగ్గుపాలవంటిది

మదనపల్లె సిటీ: మాతృభాష ఉగ్గుపాలవంటిదని ప్రభుత్వ బాలికల జూనియర్ కాలేజీ ప్రిన్సిపాల్ గోపతి బాలకృష్ణమూర్తి అన్నారు. శుక్రవారం స్థానిక కాలేజీఆలో అంతర్జాతీయ మాతృభాషాదినోత్సవం పురస్కరించుకుని సమావేశం నిర్వహించారు. ప్రతి ఒక్కరూ తెలుగువాడిగా పుట్టినందుకు గర్వపడాలన్నారు. పద్య విద్యకు పట్టుకొమ్మ అవధాన విద్యకు ఆలవాలం తెలుగు భాషన్నారు. తెలుగుభాషలోని చందస్సు ఏ భాషలో కూడా లేవని తెలిపారు. కార్యక్రమంలో తెలుగు భాషా పరిరక్షణ సమితి అధ్యక్షుడు సాయిశంకర్‌రెడ్డి, ఎన్ఎస్ఎస్ అధికారి రెడ్డప్పరెడ్డి, అధ్యాపకులు శివపార్వతి, శ్రీదేవి, మాలతి, రమణ పాల్గొన్నారు.

ఏకగ్రీవంగా గొర్రెల సహకార సంఘాల ఎన్నిక


రెడ్డెప్ప, చిన్నప్పకు ఎంపిక పత్రాలను అందజేస్తున్న వైద్యులు

కలకడ : మండలంలోని కలకడ, ఎనుగొండపాళ్యం పంచాయతీల్లో నిర్వహించిన గొర్రెల సహకార సంఘాల ఎన్నిక ఏకగ్రీవంగా జరిగినట్లు ఎర్రకోటపల్లె పశువైద్యాధికారి డాక్టర్ తేజకల్యాణ్ తెలిపారు. శుక్రవారం కలకడ రెవెన్యూ గ్రామం సంఘానికి కేవీపల్లె మండలం గ్యారంపల్లె పశువైద్యాధికారిణి డాక్టర్ ప్రియాంక, ఎనుగొండపాళ్యం రెవెన్యూ గ్రామం సంఘానికి డాక్టర్ తేజకల్యాణ్ ఎన్నికల అధికారులుగా వ్యవహరించినట్లు తెలిపారు. ఎనుగొండపాళ్యం పంచాయతీకి దిగువపాళ్యం పంచాయతీ కార్యాలయంలో నిర్వహించిన లక్ష్మీనరసింహ సహకార సంఘానికి అధ్యక్షుడిగా వై. జగదీష్, కార్యదర్శిగా జి.మహేశ్వరను ఎన్నుకున్నారని తెలిపారు. అలాగే కలకడ రెవెన్యూ గ్రామానికి ఝరిగడ్డ దిగువపాళ్యం గ్రామంలో నిర్వహించిన ఎన్నికలో శ్రీలక్ష్మీనరసింహాస్వామి సంఘానికి చెందిన వై.రెడ్డెప్ప అధ్యక్షుడిగా, వై.చిన్నప్పను కార్యదర్శిగా ఎన్నికయ్యారని పేర్కొన్నారు.

మహాశివరాత్రి ఉత్సవాలకు పటిష్ట ఏర్పాట్లు

నిమ్మనపల్లె : మండలంలోని తవళం శ్రీ నేల మల్లేశ్వర స్వామి ఆలయం వద్ద మహాశివరాత్రి ఉత్సవాల నిర్వహణకు పటిష్ట ఏర్పాట్లు చేస్తున్నట్లు దేవాదాయ శాఖ ఇన్‌స్పెక్టర్ శశికుమార్, ఆలయ ఈఓ మంజుల తెలిపారు. శుక్రవారం ఆలయం వద్ద మహాశివరాత్రి ఉత్సవాల నిర్వహణపై తహసీల్దార్ అమరనాథ్, ఎంపీడీఓ పరమేశ్వర్ రెడ్డి, ఆలయ తాత్కాలిక కమిటీ చైర్మన్ మేషా రామకృష్ణతో కలసి ఏర్పాట్లపై స్థానికులతో చర్చించేందుకు సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఉత్సవాలకు హాజరయ్యే భక్తులకు ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు తీసుకుంటామన్నారు. తాగునీరు, క్యూలైన్లు, అన్నదాన కార్యక్రమం నిర్వహణకు తగిన ఏర్పాట్లు చేస్తామన్నారు. భక్తులకు పూర్తిస్థాయిలో వసతులు కల్పిస్తామన్నారు. పోలీసుల సహకారంతో వాహనాల రాకపోకలకు అంతరాయం లేకుండా చూస్తామన్నారు. తవళం సర్పంచ్ రెడ్డప్ప, రాజన్న, రెడ్డప్ప రెడ్డి, లక్ష్మన్న, శ్రీపతి పాల్గొన్నారు.

న్యాయం చేయకుంటే కార్యాలయం ఎదుటే జాతర

- జాతర భూమి కోసం ఏడాదిగా పోరాటం
- స్పందించి క్షేత్రస్థాయిలో పరిశీలించిన తహసీల్దార్


ఉత్సవాలు నిర్వహించుకునే ప్రభుత్వ భూమిని పరిశీలిస్తున్న తహసీల్దార్

బి.కొత్తకోట: గ్రామానికి న్యాయం జరగకుంటే వచ్చే నెల 26న జరిగే జాతర ఉత్సవాలను బి.కొత్తకోట తహశీల్దార్ కార్యాలయం ఎదుట నిర్వహించుకుంటామని గండువారిపల్లి గ్రామస్తులు పేర్కొన్నారు. 'తాతల కాలం నుంచి గ్రామస్తులు జాతరలు, పండగలు, వేడుకలను నిర్వహించుకునే ప్రభుత్వ గయాళు భూమిని ఓ మహిళ పేరుతో ఆన్‌లైన్ చేశారు, దీనిపై ఏడాదిగా పోరాడుతున్నాం, కలెక్టర్, సబ్‌కలెక్టర్, గతంలో నలుగురు తహసీల్దార్లను వేడుకున్నాం. ఫలితం లేదు మీరైనా న్యాయం చేయండి' సార్ అని విన్నవించిన గ్రామస్తుల సమస్యపై బి.కొత్తకోట తహసీల్దార్ మొహమ్మద్ అజారుద్దీన్ తక్షణమే స్పందించారు. శుక్రవారం మధ్యాహ్నం గుమ్మసముద్రం పంచాయతీ వడిగలవారిపల్లి సచివాలయంలో రైతు సుదర్శన్ ఆందోళనపై విచారించిన ఆయనకు గండువారిపల్లిలో గయాళు భూమి 4.50 ఎకరాలను ఓ మహిళ పేరుతో అక్రమంగా నమోదు చేయించుకున్న విషయాన్ని ఆయన దృష్టికి తెచ్చారు. దీనితో అప్పటికప్పుడే భూమిని పరిశీలించేందుకు గ్రామస్తులతో కలిసి వెళ్లారు. సర్వే నంబర్ 271, 271/1, 272, 285లో ఉన్న 4.50 ఎకరాల గయాళు భూమిలో గ్రామస్తులు పూజించుకునే ఆలయాలు, చిట్లకుప్ప, జాతర ప్రదేశాలను పరిశీలించారు. అక్కడే ఉన్న వీఆర్ఓ కోటిరెడ్డికి భూమికి సంబంధించి వివరాలు కోరగా ఈ సర్వే నంబర్లను ఫ్రీహోల్డ్ నుంచి తొలగించామని, ఆన్‌లైన్ తొలగింపు చర్యలు తీసుకుంటామని చెప్పారు. దీనిపై గ్రామస్తులు అసలు పట్టా ఎలా ఇచ్చారు, దానికి ఆన్‌లైన్ చేసి ఎవరిచ్చారు, ఏ హక్కుతో ప్రభుత్వ గయాళు భూమిని కట్టబెట్టారని ప్రశ్నించారు.